క్లుప్తంగా

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఊశన్న

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అనుముల ఊశన్నను నియమిస్తూ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల్ జిల్లా ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

గుడుంబా తయారీదారులకు జరిమానా

ఇచ్చోడ: గుడుంబా తయారు చేస్తున్న ఇద్దరికి జరిమానా విధించినట్లు ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. గురువారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఇచ్చోడ మండలంలోని జల్దా గ్రామానికి చెందిన భీంలాల్, బోథ్ మండలంలోని నిగిని గ్రామానికి చెందిన జాదవ్ అనుషబాయిలు గుడుంబా తయారు చేస్తుండగా పలుమార్లు పట్టుబడినట్లు పేర్కొన్నారు. దీంతో ఇద్దరిని తహసీల్దార్లు ఎదుట బైండోవర్ చేయగా ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

బోథ్: పోలీసుల అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సీఐ రమేశ్, ఎస్సై ప్రవీణ్ కుమార్‌తో పాటు కానిస్టేబుల్‌లు, సిబ్బంది యువకులు, యువజన సంఘాలు, సామాజిక సంఘాలు రక్తదానం చేశారు. మొత్తం 84 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు వారు తెలిపారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

నార్నూర్: మండల కేంద్రంలోని ఉప మార్కెట్‌యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మాన్కాపూర్‌లో రైతులతో సమావేశం అయ్యారు. నార్నూర్, గాదిగూడ ఉమ్మడి మండలంలో రైతులు అత్యధికంగా మొక్కజొన్న సాగు చేయడం జరిగిందని అన్నారు. పంట చేతికి రావడంతో గోదాంలు లేక ఆరుబయటే పెట్టాల్సి వస్తోందన్నారు. ఆయన వెంట రైతులు భీంరావు, సీతారాం, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

నేరడిగొండ: మండలంలోని చిన్న బుగ్గారం ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడిని పాఠశాల సిబ్బంది ఆత్మీయ సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు రామకృష్ణ మాట్లాడుతూ పాఠశాలలో తొమ్మిది సంవత్సరాలు పని చేసి పాఠశాల విడిచి వెళ్తున్నందుకు బాధగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

నార్నూర్: ఇటీవల కురిసిన భారీ వర్షానికి రోడ్లు దెబ్బతినడంతో గాదిగూడ మండలంలోని పొనూర్ గ్రామ ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. గిరి పల్లెల్లో దండారీ ఉత్సాహలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం పంచాయతీ కార్యదర్శి వెంకటసాయితో కలిసి గ్రామపటేల్ నైతం జంగు, నైతం సోనేరావులు తాత్కాలికంగా మట్టి వేసి రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బోథ్: మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద పులి సంచరిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఎఫ్ఆర్‌వో పుండలిక్‌లు పలు గ్రామాల్లో తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. పార్డి(బి), గొల్లాపూర్, చింతల్ బోరి, పుణ్యనాయక్ తండా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గొల్లాపూర్ నుంచి చింతగూడకు గుట్టపై నడుస్తూ వెళ్లారు. పులి తిరిగిన జాడలను గమనించారు.

వర్ధంతి విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఈనెల 26న నిర్వహించే వెడుమ రాము వర్ధంతిని విజయవంతం చేయాలని ఆదివాసీ బిర్డు గోండ్ సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు నైతం శేఖర్ కోరారు. గురువారం మండలంలోని దుబార్‌పేట్‌లో వర్ధంతి కరపత్రాలు ఆవిష్కరించారు. తిర్యాణి మండలంలోని ఎదలపాడులో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సేవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందుర్‌జగన్, చాకటి పవన్, వాడే సాయి పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు..!

- పలు ప్రాంతాల్లో పూర్తికాని రోడ్డు పనులు
- అదుపు తప్పుతున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు


అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రానికి అనుకోని ఉన్న ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి గ్రామ మీదుగా వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. అయినా.. ఎలాంటి స్పందన లేదు. గత ఏడాది క్రితం వర్ష కాలంలో జైనథ్ మండలంలోని తరోడ వంతెన కుంగిపోయిన విషయం తెలిసిందే. దీంతో రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం లేకపోవడంతో స్పందించిన ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి సమీపం నుంచి నిరాల వరకు 15 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ. 30 కోట్లు నిధులు మంజూరు చేసింది.

పూర్తికాని పనులు..

సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (సీఆర్ఐఎఫ్) నిధులతో గత ఏడాది సెప్టెంబర్‌లో జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి గ్రామం మీదుగా ఏడు మీటర్ల వెడల్పుతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే ఆదిలాబాద్ నుంచి లాండసాంగ్వి గ్రామం మీదుగా వెళ్లే రోడ్డు మార్గంలో మధ్య మధ్యలో ఇంకా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాలేదు. గిట్టి వేసి నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు బోటు చేసుకుంటున్నాయి. దీంతో గాయాల పాలవుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్య మధ్యలో అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డు పనులు వెంటనే పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఇళ్ల మధ్య నుంచి..

లాండసాంగ్వి గ్రామం నివాస ఇళ్ల మధ్యలో నుంచి రోడ్డు ఉంది. ఈ రోడ్డు గుండా ప్రతీ రోజు వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. బీటీరోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో దుమ్ముతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



తమ గ్రామానికి వేళ్లే రోడ్డు మార్గంలో బీటీ రోడ్డు నిర్మాణం చేశారు. ఆదిలాబాద్ నుంచి లాండసాంగ్వి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో కొన్ని చోట్ల మధ్యలో పనులు ఇంకా పూర్తి చేయాల్సి ఉంది. గిట్టి వేసి పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. – శాలిక్‌రావ్, లాండసాంగ్వి

దుమ్ముతో ఇబ్బంది



తమ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో బీటీ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము ఇళ్లలోకి వస్తోంది. కనీసం రోడ్డుపై నీళ్ల కూడా చల్లడం లేదు. పనులు సకాలంలో పూర్తి చేసి ప్రయాణికులకు, ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. – శ్రీనివాస్, లాండసాంగ్వి

ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలి


కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఇచ్చోడ: కాంగ్రెస్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ముఖరా(కె) గ్రామ ఉద్యమ స్ఫూర్తిని రాష్ట్ర ప్రజలు కొనసాగించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభకు వెళ్తుండగా.. 44 వ జాతీయ రహదారి ముఖరా(కె) రోడ్డు వద్ద గ్రామస్తులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. రైతు రుణమాఫీ కోసం సెల్ఫీ ఉద్యమం, ఆరు గ్యారంటీల అమలు కోసం పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టిన గ్రామస్తుల ఉద్యమ స్ఫూర్తి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు తిరుపతి, మాధవ్, విట్టల్, అశోక్, అర్చన పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే


కేటీఆర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఘన స్వాగతం పలికారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గురువారం ఆది లాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతన్నల కో సం రామన్నల పోరుబాట కార్యక్రమానికి వెళ్తున్న ఆయనను శాలువాతో సత్కరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బెల్ట్‌షాపులను వెంటనే తొలగించాలి



మాట్లాడుతున్న కల్లెపెల్లి గంగయ్య

ఇచ్చోడ: మండల కేంద్రంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని దీంతో యువత మద్యానికి బానిసవుతున్నారని వెంటనే బెల్ట్‌షాపులను తొలగించాలని సీపీఐ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రజలు నివాసించే కాలనీలు, పాఠశాలలకు సమీపంలో 24 గంటలు బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయిండంతో యువత పక్కదారిన పడుతున్నారని ఆరోపించారు. పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు చొరవ తీసుకోని వెంటనే బెల్ట్‌షాపులు తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గాజంగుల రాజు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత 40 రోజులుగా ఆన్‌లైన్ బంద్ ఉండడంతో కార్మికులు చాలా ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. కార్మికులు చదువుకోక పోవడం వల్ల రెన్యూవల్ చేసుకోలేక పోతున్నారన్నారు.

పెసా చట్టాన్ని గౌరవించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఐదో షెడ్యూల్డ్ ప్రకారం పెసా చట్టం అమలులో ఉన్నందున వలస గిరిజనేతరులకు ఇల్లు కట్టుకునే అవకాశం ఇవ్వవద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు డిమాండ్ చేశారు. గురువారం సంఘ నాయకులతో కలిసి ఉట్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో డీటీ అమృత్‌లాలకు, ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెసా చట్టంతో పాటు గిరిజన ప్రాంతంలోని భూ బదలాయింపు నిషేధ చట్టం అమలులో ఉన్నందున 1970 తర్వాత వచ్చిన వారికి ఎలాంటి నిర్మాణాలకు అవకాశం ఇవ్వొద్దని కోరారు. కార్యక్రమంలో ఉమేశ్, రమేశ్, శంభు, దేవ్‌రావు, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

పార్డి(కె)లో భోగి పండుగ


పూజలు చేస్తున్న ఆదివాసీలు

బోథ్: మండలంలోని పార్డి(కె) గ్రామంలో ఆదివాసీలు గురువారం భోగి పండుగ నిర్వహించారు. దండారీ ఉత్సవాలు ప్రారంభమయ్యే సమయంలో ఆదివాసీలు భోగి పండుగను నిర్వహిస్తారు. కాగా గ్రామస్తులు గుస్సాడి టోపి, కొడల్‌పెన్, వెట్టే, పర్రా దేవుళ్లకు పూజలు చేశారు. అనంతరం గారెలతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో పటేల్ అమృత్ రావ్, ఐటీడీఏ మాజీ డైరెక్టర్ మెస్రం భూమన్న, దేవారి జైతు, పురుషోత్తం, రాజు, రమేష్, ప్రవీణ్, దశరత్, సురేశ్, నవీన్ పాల్గొన్నారు.

జీవో 29 రద్దు చేయాలి

ఉట్నూర్‌రూరల్: జీవో 29ని రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు న్యాయం చేయాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. బీసీల జనాభా 52 శాతం ఉందని బీసీల సర్వే చేసి వారి స్థితిగతులు పనులు, వృత్తులపై బీసీ కమీషన్ లోతుగా ఆలోచించాలన్నారు. అదే విధంగా పంచాయితీ రాజ్ ఎలక్షన్‌లో 42 శాతం రిజర్వేషన్ బీసీలకు ప్రభుత్వం ఇవ్వాలన్నారు. అందుకు కేంద్ర ప్రభుత్వం కూడా ఆలోచించాలన్నారు. సమావేశంలో నాయకులు జాదవ్ రవి, గొల్లపెల్లి శ్రీనివాస్, గర్షకుర్తి వెంకటేశ్, తదితరులు, పాల్గొన్నారు.

పోస్టులు భర్తీ చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. గురువారం అంగన్‌వాడీలతో కలిసి ఐసీడీఎస్ ఏపీడీ, జిల్లా ఉపాధికల్పన అధికారి మిల్కాకు వినతిపత్రం అందజేశారు.

శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసుల పాత్ర కీలకం


మాట్లాడుతున్న సీఐ భీమేశ్

ఇచ్చోడ: శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసుల పాత్ర కీలకమని ఇచ్చోడ సీఐ భీమేశ్ అన్నారు. గురువారం ఇచ్చోడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా ప్రతీ ఏటా ఓపెన్‌హౌస్ నిర్వహించడం జరుగుతుందన్నారు. వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులకు పోలీసు శాఖ అందిస్తున్న సేవలను వివరించారు. ఆయుధాల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉదయం శివాజీ చౌక్ నుంచి సిరిచెల్మ చౌరస్తా వరకు 2కే రన్ చేపట్టారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిఖిని వర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం


ఆర్థికసాయం చేస్తున్న శ్యాంరెడ్డి

ఇచ్చోడ: మండలంలోని జల్దా గ్రామానికి చెందిన 12 సంవత్సరాల రమ కుమారి బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ.. నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రి ఖర్చులు లేక అపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. మండల కేంద్రంలోని విద్యాలయ పాఠశాల కరస్పాండెంట్ శ్యాంరెడ్డి గురువారం నిజామాబాద్‌లో రమకుమారి కుటుంబసభ్యులు కలిసి తమ పాఠశాల తరపున రూ. 67500 నగదు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నేరడిగొండ: మండలంలోని వాంకిడి గ్రామానికి చెందిన మర్ల శ్రీనివాస్ యాదవ్ కుమారుడు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మాజీ సర్పంచ్ మర్ల రాజన్న పక్షవాతానికి గురై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్


2కే రన్ ప్రారంభిస్తున్న ఎస్సై సునీల్

ఇంద్రవెల్లి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా పోలీసు శాఖ ఆ ధ్వర్యంలో గురువారం ఉద యం మండల కేంద్రంలో 2కే రన్ నిర్వహించారు. ఎస్సై దు బ్బక సునీల్ ప్రారంభించారు. వివిధ పాఠశాల విద్యార్థులు, మండల కేంద్రంలోని యువకులు, నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు 2కే రన్ నిర్వహించారు. ఈసందర్భంగా విజేతలకు ఎస్సై బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ అఫ్సర్, నాయకులు ఎండీ మసుద్, కాంబ్లే బాలాజీ, పరత్‌వాగ్ దత్త, ఆరీఫ్, జోందలే సంజీవ్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


కుంకుమార్చన చేస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ దుర్గాదేవి ఆలయం మూడో వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించారు. సంతోష్ శర్మ పూజారి ఆధ్వర్యంలో హోమం, కుంకుమార్చన చేపట్టారు. అనంతరం మాదపూర్ గ్రామానికి చెందిన నారాయణ్ మహరాజ్ ఆధ్వర్యంలో భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనలు బోధించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ హెరేకుమ్ర జంగు పటేల్, ఆలయ కమిటీ కాడే బాలాజీ, కేంద్రే లక్ష్మణ్, సాయి చాటే, తుమ్రం మోహపత్‌రావ్, భక్తులు పాల్గొన్నారు. – ఇంద్రవెల్లి


హోమంలో పాల్గొన్న భక్తులు


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి


పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో అనిత

నార్నూర్: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని ఎంఈవో పవార్ అనిత అన్నారు. గురువారం మండలంలోని భవానీగూడ, బలాన్‌పూర్, నాగల్‌కొండ, ముస్లింగూడ, ముక్తాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్‌లను పరిశీలించారు. పాఠశాలలో పిచ్చి మొక్కలు లేకుండా చూడాలన్నారు. ప్రతిరోజు తప్పనిసరిగా మెనూ పాటించాలన్నారు. పాఠశాల విద్యార్థుల్లో డ్రాపౌట్ లేకుండా ఉపాధ్యాయులు చూసుకోవాలన్నారు. ఆయన వెంట సీఆర్‌పీ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి


బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థులు

తలమడుగు: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిఒక్కరూ కాపాడుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మహిళలు ఎంతో ఇష్టమైన బతుకమ్మ పండుగను కళాశాలలో నిర్వహించడం అభినందనీయమన్నారు. అదే విధంగా విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదువుకొని వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుదర్శన్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోగ్ బండారో పూజ


భోగ్ బండారో పూజ చేస్తున్న గ్రామ పెద్దలు

నార్నూర్: మండలంలోని నాగల్‌కొండ గ్రామంలో గురువారం భోగ్ బండారో మహాపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్ద గుణవంత్ నాయక్ భోగ్ బండారో పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీవేంకటేశ్వర స్వామి, హతీరామ్ బాబా మఠాన్ని దర్శించుకుని ఏడు రోజులపాటు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సేవలు చేసిన గ్రామస్తులు తిరిగి గ్రామానికి రావడంతో లంబాడి గిరిజనుల సాంప్రదాయ ప్రకారం భోగ్ బండారో మహాపూజ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికం వైపు అడుగులు వేయాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

పాఠశాలను తిరిగి ప్రారంభించండి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీగూడ గ్రామంలో మూతపడిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించాలని గురువారం గ్రామస్తులు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ తకార్యాలయంలో ఎంఈవో పవార్ అనితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 100పైగా దళిత కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, దాదాపు 30 మంది పిల్లలు ఉన్నారన్నారు. గత కొన్ని ఏళ్ల క్రితం అధికారుల తప్పుడు రిపోర్టుల కారణంగా పాఠశాలను మూసివేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం పాఠశాల లేకపోవడంతో రెండు కిలో మీటరు దూరంలో ఉన్న తండాకు వెళ్లి విద్యార్థులు చదువుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పాఠశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు దుర్గే యశ్వంతరావు, దుర్గే గుణవంతరావు, కర్మన్‌కర్ గౌతమ్, కర్మన్‌కర్ బుద్ధజీ, మునేశ్వర్ సంతోష్, ఝాడే ఆత్మరామ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

బేల: డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని మండల తహసీల్దార్ కొట్నాక రఘునాథ్ రావు కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఓటరు నమోదు కోసం ఫారం– 18 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండు కలర్ పాస్‌ఫొటోలు, ఆధార్‌కార్డు, డిగ్రీ మెమోలను జతచేయాల్సి ఉంటుందన్నారు. ఓటరు నమోదు కోసం ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో జూనియర్ అసిస్టెంట్‌లు అరవింద్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.